నేటి నుంచి డిజిటిల్ సిటీజన్ సమ్మిట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నేటి నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్ డిజిటిల్ సిటీజన్ సమ్మిట్ జరగనున్నది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో స్వచ్ఛంద సంస్థ డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ ఒసామా మంజర్, సెంటర్ ఫర్ డెవలప్ మెంట్ పాలసీ అండ్ ప్రాక్టీస్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ అమీర్ ఉల్లా ఖాన్, గ్లోబల్ డిజిటల్ ఇన్‌క్లూజివ్ పాట్నర్ షిప్ ప్రతినిధి సోనియా జార్జ్ సమ్మిట్ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ టీ హబ్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సమ్మిట్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన ఆవిష్కరణల నిపుణులు, విద్యావేత్తలు, పౌర సమాజ ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య విస్తరణ, ఇంటర్నెట్ కనెక్టివిటీని పెంచడానికి గల అవకాశాలపై ప్రభుత్వాలతో కలిసి పని చేస్తున్నట్టు వారు తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ నాగేశ్వరరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సీనియర్ జర్నలిస్ట్ వై.నాగేశ్వరరావు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఒయు తెలుగు శాఖ నుంచి ఆచార్య డి.చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో "ఆధునిక తెలుగు సాహిత్యం- లౌకికవాదం" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకుగాను ఆయనకు డాక్టరేట్‌ను అందించారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 83వ స్నాతకోత్సవంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్, అమెరికాలోని అడోబ్ సంస్థ చైర్మన్ అండ్ సీఈవో డాక్టర్ శంతన్ నారాయన్‌లు ఆయనకు పట్టాను అందజేశారు. హైదరాబాద్ కేంద్రంగా గత 34 సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న వై.నాగేశ్వరరావు ప్రస్తుతం వార్త దినపత్రిక బ్యూరో చీఫ్‌గా పని చేస్తున్నారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యాన్ని లౌకికవాద కోణంలో ఎంతో ఆసక్తితో పరిశోధించి తన సిద్ధాంత గ్రంథాన్ని పూర్తి చేశానని తెలిపారు.

అభ్యాసనా సామర్థ్యాలు పెంచేలా విద్యను బోధించాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
అభ్యాసనా సామర్థ్యాలను పెంపొందించేలా గుణాత్మక విద్యను బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు. తన తల్లిదండ్రులు చిట్ల ప్రమీల - జీవన్ రాజ్ పేరిట నెలకొల్పిన ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్వీయ పర్యవేక్షణలో బుధవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని పెర్కిట్‌లో విద్యా స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. మండలం పరిధిలోని 21 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కెజిబివి, మోడల్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు, ఆంగ్ల మాధ్యమంలో గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు బోధించే 140 మంది ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యాల పెంపుపై స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సిఇఆర్‌టి) నిపుణులతో ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు.
తాము బోధించే సబ్జెక్టులను ఇంగ్లీష భాషలో విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో, వారి సామర్థ్యాలను పెంపొందించేలా ఎలా బోధించాలి అనే అంశాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్లు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ, మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తు న్నప్పటికీ విద్యార్థుల్లో ప్రస్తుత పోటీ ప్రపంచ స్థాయికి తగినట్టుగా ప్రతిభ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుణాత్మక విద్యా బోధనా, అభ్యాసనా సామర్థ్యాల పెంపుతో పరిస్థితిలో మార్పు వస్తుందని, కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించిన అనేక సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ తాను చదువుకున్న ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల గురించి, ఇక్కడి విద్యార్థుల బాగోగుల కోసం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పడే తపన అనన్య సామాన్యమైనది కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వినోద్ కుమార్, డిఇఒ దుర్గాప్రసాద్, డిఐఇఒ రఘురాజ్, డిపిఒ జయసుధ, ఎస్‌సిఇఆర్‌టి రిసోర్స్ పర్సన్లు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ చారి, రాజేందర్ కుమార్, ట్రస్ట్ కార్యదర్శి ఎన్.నర్సింలు, పాల్గొన్నారు.

మోడీ.. అన్నీ ప్రయివేటీకరణ చేస్తున్నారు

- మోటార్లకు మీటర్లు పెట్టమంటే కుదరదని చెప్పిన : సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
"నరేంద్రమోడీ ఈ దేశాన్ని ఏమి చేస్తాడో..! ఎల్ఐసిని అమ్ముతున్నాడు.. విమానాశ్రయాలు, ఓడరేవులు.. ఇలా అన్నీ ప్రయివేటీకరణ చేస్తున్నాడు.. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టమంటున్నాడు" అని బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఉత్తర భారతదేశంలో దళితులపై దాడులు జరగని రోజే లేదన్నారు. 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో దళితులు అణచివేతకు గురయ్యారని, వారిని సాటి మనుషులుగా గుర్తించింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. 'దళిత చైతన్య జ్యోతి' కార్యక్రమం ద్వారా దళితబంధుకు రూపం ఇచ్చామని, ఇదేదో ఎన్నికల కోసం రూపొందించిన పథకం కాదన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సత్తుపల్లి, ఇల్లెందు నియోజకవర్గాల్లో బుధవారం నిర్వహించిన బిఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభల్లో కెసిఆర్ ప్రసంగించారు.

దళితబంధు ఎన్నికల కోసం కాదు

ప్రజాస్వామ్య పరిణతి వస్తేనే అద్భుతాలు, అభివృద్ధి అని అన్నారు. ఎవడో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తేనో దళితబంధు రాలేదన్నారు. మూడు రంగులు, ఎర్రజెండాలు, పసుపు జెండాలు దళితులను ఓటుబ్యాంకుగా వాడుకున్నాయే కాని ఏనాడూ వారి శ్రేయస్సు గురించి ఆలోచన చేయలేదన్నారు. ఉత్తర భారతదేశంలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, చివరకు ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లోనూ దళితులపై దాడి జరగని రోజు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది ఓట్లు రావాలి, పూట గడవాలని కాదు తెలంగాణను బాగు చేయాలనే ఆలోచనతో మ్యానిఫెస్టోలో లేకపోయినా దళితబంధు అనే పదాన్ని వెలుగులోకి తెచ్చామన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా తెచ్చిన ఈ పథకాన్ని రాజకీయాలకు అతీతంగా ఖమ్మం జిల్లాలో ప్రతిపక్ష ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరలోని చింతకాని మండలం మొత్తానికి వర్తింపజేశామని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా దళితబంధు అమలు చేసేందుకు జీవో జారీ చేసిన కొద్దిరోజులకే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఆరునూరైనా గెలిచేది బిఆర్ఎస్సేనని.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దళితబంధును యథాతథంగా అమలు చేస్తామన్నారు.

మోడీ ప్రయివేటీకరణ

ప్రయివేటీకరణ పేరుతో.. ఎల్ఐసి, ఓడరేవులు, విమానాశ్రయాలు అమ్ముతున్నారన్నారు. కరెంట్‌ను ప్రయివేటీకరించేందుకు తాను అంగీకరించలేదన్నారు. భద్రాద్రి వంటి పవర్‌ప్లాంట్‌ను జెన్కో ఆధ్వర్యంలో నిర్మించామన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టమంటున్నారని, సంవత్సరానికి రూ.25 కోట్ల నష్టాన్ని భరించామే కానీ మోటార్లకు మీటర్లు పెట్టలేదని తెలిపారు.

కాంగ్రెస్‌వి బలుపు రాజకీయాలు

"ఓ ఇద్దరు కాంగ్రెస్‌లో చేరిండ్రు.. ఒకడు మాట్లాడతడు.. అసెంబ్లీ గేటు తాకనీయ అంటాడు" అని అన్నారు. మీరు తలచుకుంటే దుమ్ములేవదా.. అని కెసిఆర్ సభికులను ప్రశ్నించారు. డబ్బు రాజకీయాలు, అహంకార రాజకీయాలు తగవన్నారు. కాంగ్రెస్ ధరణి పోర్టల్ ఎత్తివేస్తామంటోంది.. ధరణి పోతే మళ్లీ రైతుల భూములపై విఆర్ఎ, విఆర్‌వో, ఎమ్మార్వో, ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ ఎవడికి కోపం వచ్చినా భూములు మారతాయన్నారు. రైతుల భూములపై అధికారులు, ప్రభుత్వానికి అధికారం తీశామన్నారు. రాహుల్‌కు ఎద్దు, వ్యవసాయం తెల్వదన్నారు. బలుపు రాజకీయం చేసిన నేతలు సీతారామ ప్రాజెక్టు ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. గుండెకాయలాంటి సీతారామను పూర్తి చేసి సాగర్ నీళ్ల తండ్లాట నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాను బయటపడేస్తామని తెలిపారు. కృష్ణాలో నీళ్ల వాటా తక్కువ కాబట్టి గోదావరి నీటితో పాలేరును నింపుతామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ వస్తే చీకట్లు వస్తాయన్నారని.. ఇప్పుడు మనకు వెలుగులు, వాళ్లకు చీకట్లు వచ్చాయన్నారు. వ్యక్తుల మధ్య పోరాటం కాదు.. పార్టీ మధ్య పోరాటం.. కాంగ్రెస్ ఏమి చేసిందో మనసుపెట్టి ఆలోచన చేయాలని ప్రజలను కోరారు.
సభల్లో బిఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపిలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మంత్రి, బిఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తాతా మధుసూదన్, రఘోత్తమ్‌రెడ్డి, అశ్వారావుపేట బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాములునాయక్, డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమామహేశ్వరరావు, బిఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం జిల్లా అధ్యక్షులు చింతనిప్పు కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న కెటిఆర్

దళితులకు అసైన్డ్ భూములిస్తం

- ప్రజాఆశీర్వాద సభల్లో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
'గంప గోవర్ధన్ చేతిలో మూడుసార్లు ఓడిపోయిన షబ్బీర్ అలీ కెసిఆర్‌పై గెలవడం కష్టమని నిజామాబాద్‌కు వెళ్తున్నట్టు తెలిసింది. కెసిఆర్‌పై పోటీ చేయడానికి రేవంత్‌రెడ్డి వస్తుండట. ఈసారి కూడా అదే గంప కింద రేవంత్‌రెడ్డిని కప్పి పెట్టాలి' అని మంత్రి కెటిఆర్ ప్రజలను కోరారు. గంపగోవర్ధన్ కోరిక మేరకే కెసిఆర్ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారని, లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్, దోమకొండ మండల కేంద్రాల్లో బుధవారం ప్రజాఆశీర్వాద సభలకు కెటిఆర్ హాజరై ప్రసంగించారు. అదానీ పంపిస్తున్న సలాకా సిమెంటును బిజెపి అభ్యర్థి పంపిణీ చేస్తున్నారని, దాన్ని ప్రతి ఒక్క కుల సంఘం తీసుకోవాలని, ఎన్నికల్లో మాత్రం బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కెసి ఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను చూసి ప్రజలు ఓటు వేస్తారని తెలిపారు. కెసిఆర్ కామారెడ్డి నుండి పోటీ చేసి గెలిస్తే కామారెడ్డిలో ఉన్న ప్రభుత్వ భూములు అమ్మేస్తారని ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాటలు నమ్మవద్దని, కామారెడ్డి నుంచి కేసీఆర్ గెలిచిన తర్వాత నియోజకవర్గంలో ఉన్న అసైన్డ్ భూములు దళితులకు ఇవ్వనున్నట్టు తెలిపారు. కేసీఆర్‌ను ఢీకొట్టడానికి ఇతర రాష్ట్రాల నుంచి ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నారని, కానీ కెసిఆర్ లోకల్ అని, రాష్ట్ర ప్రజల మధ్యలో ఉండి దేశానికి తెలంగాణ దిక్సూచిగా అభివృద్ధి చేయడం ఖాయమని స్పష్టం చేశారు.

మా పూర్వీకుల స్వస్థలం కోనాపూర్

కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ మండలం పోసానిపల్లి గ్రామంలో మా నాయనమ్మ ఉండేవారని, నిజాం ప్రభుత్వం హయాంలో మానేరు ప్రాజెక్టులో మా భూములు కోల్పోవడంతో, నాటి నిజాం ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలతో చింతమడక గ్రామానికి వలస వెళ్లినట్టు తెలిపారు.

పాలస్తీనాకు మద్దతుగా ప్రదర్శన

పజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని ఆపాలని, పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని, భారత ప్రభుత్వం పాలస్తీనాకు అండగా నిలవాలని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వద్ద సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, ఎఐటియుసి, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, టిఎన్‌టియుసి, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘాలు తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పాలస్తీనాకు మద్దతుగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలస్తీనా భూభాగం మీద, ప్రజల మీద ఇజ్రాయిల్ తీవ్రమైన దాడులు చేస్తున్నదన్నారు. ఎక్కడ చూసినా శవాల గుట్టలు, పసిపిల్లల ఆర్తనాదాలతో గాజా ప్రాంతమంతా రోదనగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 75 ఏండ్లుగా పాలస్తీనా భూభాగాన్ని అక్రమించుకుంటూ ఈ యుద్ధం ద్వారా ప్రపంచ పటం నుంచి పాలస్తీనా ఉనికి లేకుండా చేయాలని, పాలస్తీనా ప్రజలందరిని శరణార్థులుగా మార్చేసి అ భూభాగాన్ని అక్రమించాలని, ఒక సామ్రాజ్యవాద అధిపత్య కుట్రతో యుద్ధం కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ.. అమెరికా ఒక్కటే ఇజ్రాయిల్‌కు అండగా నిలబడిందన్నారు. దేశంలోని బిజెపి ప్రభుత్వం గత సంప్రదాయాలకు భిన్నంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఇది మన దేశానికి ప్రమాదకరమని, ప్రపంచ శాంతికి నష్టం కలిగి స్తుందన్నారు. ఇప్పటికైనా ఇజ్రాయిల్‌లోని గాజా ప్రాంతాన్ని వదిలిపెట్టాలని, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను అంగీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, టిఎన్‌టియుసి అధ్యక్షులు యంకె బోస్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, ఐద్వా, గిరిజన సంఘం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పోటీ విషయంపై నేడు నిర్ణయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై గురువారం నిర్ణయాన్ని ప్రకటిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. కాంగ్రెస్‌తో సర్దుబాటు ఉంటుందా? లేదా? అన్నది గురువారం నాటికి స్పష్టత వస్తుందన్నారు. సిపిఐ, సిపిఎం ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించి తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో నిర్వహించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరయ్యారు.
అనంతరం మీడియాతో తమ్మినేని మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన ఎత్తుగడలు, కాంగ్రెస్‌తో ఇప్పటి వరకు జరిగిన చర్చలపై రాష్ట్ర కమిటీలో చర్చించామన్నారు. మిర్యాలగూడ, వైరా స్థానాలను ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని గుర్తు చేశారు. వైరా ఇవ్వబోమంటూ ఇప్పుడు అంటున్నదని తెలిపారు. గతంలో భద్రాచలం, పాలేరు వీలు కాదంటే వదులుకున్నామని అన్నారు. ఇస్తామన్న వైరా కూడా ఇవ్వబోమంటున్నారని వివరించారు. ఇంతకంటే తాము తగ్గే అవకాశం లేదన్నారు. ఆ రెండు సీట్లు ఇవ్వకుంటే విడిగా పోటీ చేసే అంశంపై నిర్ణయం తీసుకుంటామని మూడురోజుల కింద ప్రకటించానని చెప్పారు. అందుకనుగుణంగా నియోజకవర్గాల వారీగా చర్చించామని అన్నారు. 'పోటీకి సంబంధించి తుది నిర్ణయం తీసుకోవద్దు. సోనియాగాంధీ అనారోగ్యం వల్ల మంగళవారం కాంగ్రెస్ సమావేశం జరగలేదు. గురువారం నాటికి సమాచారం ఇస్తాం. పాజిటివ్‌గానే నిర్ణయాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తాం. మీ నిర్ణయాలు ఇప్పుడే తీసుకోవద్దు' అని కాంగ్రెస్ నేతలు తమకు ఫోన్ చేశారని చెప్పారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాన్ని బుధవారం నిర్వహించారని గుర్తు చేశారు. రెండు రోజులు ఆగాలనీ, ఇద్దరం కలిసే నిర్ణయం తీసుకుందామని వారు కోరారని వివరించారు. ఈ విషయాలపై రాష్ట్ర కమిటీలో చర్చించామన్నారు. సిపిఐతో గురువారం ఉదయం చర్చిస్తామని చెప్పారు. ఈలోపు కాంగ్రెస్ నిర్ణయం తెలుస్తుందని తెలిపారు. మిర్యాలగూడ, వైరా సీట్లు కాంగ్రెస్ ఇవ్వకుంటే తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు.

బిసిలకు న్యాయమెలా చేస్తారు?

- కాంగ్రెస్‌కు పొన్నాల ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కాంగ్రెస్ పార్టీ 20 మంది బిసిలకు టిక్కెట్లిస్తే 40 మంది రెడ్లకు ఇచ్చిందనీ, అలాంటి పార్టీతో బిసిలకు న్యాయమెలా దక్కుతుందని బిఆర్ఎస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వి.హనుమంతరావు సొంత నియోజకవర్గంలో ముగ్గురు బిసిలు టికెట్లడిగితే ఇవ్వకుండా ఖైరతాబాద్ నుంచి రోహిన్ రెడ్డిని తెచ్చి నిలబెట్టారని విమర్శించారు.
వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, డిసిసి అధ్యక్షులు నందికంటి శ్రీధర్, ఎర్ర శేఖర్, ఆదిలాబాద్ సుజాత, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే అనిల్ లాంటి అనేక మంది బిసి నేతలకు టికెట్స్ ఎగ్గొట్టి రెడ్డిలకు అమ్ముకున్నారని ఆరోపించారు. సర్వేలు చేస్తున్నామనీ, ఆ సర్వేల్లో గెలిచిన వారికే టికెట్లు ఇస్తామనీ, పారాచూట్లకు టికెట్లు లేవని స్పష్టం చేసి, 40 టికెట్లను అమ్ముకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో నియంత పాలన నడుస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్‌తో బిసిలకు న్యాయం జరగడమనేది ఒక కల అని ఎద్దేవా చేశారు.

కెటిఆర్ వాహనం తనిఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద బుధవారం మంత్రి కెటిఆర్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో చెక్‌పోస్ట్‌లో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వాహనాన్ని పోలీసులు, ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు. కెటిఆర్ తన వాహన తనిఖీకి పూర్తిగా సహకరించారని పోలీసులు తెలిపారు. తనిఖీ అనంతరం కెటిఆర్ కామారెడ్డి బయలుదేరారు.

ఎన్నికల తాయిలాలు అభ్యర్థుల ఖాతాల్లో కలపండి

- మద్యం కట్టడికి ఆధునికంగా ఆలోచించండి
- రాష్ట్ర ఎన్నికల అధికారులకు సిఇసి కేంద్ర బృందం ఆదేశాలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో
అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనిఖీల్లో పట్టుబడిన ఎన్నికల తాయిలాలు, బహుమతుల ధరను లెక్కగట్టి, నామినేషన్ల ఖరారు తర్వాత ఆయా అభ్యర్థుల ఎన్నికల వ్యయంలో ఆ మొత్తాన్ని కలిపేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) ప్రత్యేక బృందం రాష్ట్ర అధికారులను ఆదేశించింది. అదే సమయంలో ఎన్నికలకు, రాజకీయాలకు సంబంధం లేని సామాన్యుల నగదు పట్టుబడితే, సాక్ష్యాధారాలు పరిశీలించి, వాటిని తిరిగి ఇచ్చేసే విషయంలో పారదర్శకంగా ఉండాలని చెప్పింది. ఈనెల 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు నామినేషన్లు కూడా స్వీకరించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన సిఇసి ప్రత్యేక బృందం బుధవారం హైదరాబాద్ చేరుకుంది. కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితేష్ కుమార్ వ్యాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ బృందం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో భేటీ అయ్యింది. ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించింది. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్, అదనపు సిఇఒ లోకేష్ కుమార్, జాయింట్ సిఇఒ సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సిఇఒ సత్యవాణి వివరించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలు, కేంద్ర సాయుధ దళాల వినియోగం తదితర అంశాలను కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం ఆయా విభాగాల ఉన్నతాధికారులతో వేర్వేరుగా కేంద్ర బృందం భేటీ అయ్యి, ఏర్పాట్లను అడిగి తెలుసుకుంది. డిజిపి అంజనీ కుమార్ పోలీసు బందోబస్తు, శాంతి భద్రతల పరిస్థితులను వివరించారు. ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ రాష్ట్రంలో మద్యం క్రయవిక్రయాలు, అక్రమ మద్యం స్వాధీనం, తనిఖీల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. రవాణా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీ ప్రసాద్ పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, తనిఖీలు, ప్రత్యేక బృందాల నియామకం తదితర అంశాలను తెలిపారు. ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి, అడిషనల్ డిజిపి మహేష్ భగవత్, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి సంజయ్ కుమార్ జైన్, రాచకొండ పోలీస్ కమీషనర్ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర, సెంట్రల్ రిజర్వుడ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ఐజీ చారుసిన్హా, వాణిజ్య పన్నులశాఖ కమీషనర్ క్రిస్టినా చోంగ్తు, ఎక్సైజ్ శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్ తదితరులు హాజరయ్యారు. కేంద్ర బృందంలోని అధికారులు వేర్వేరుగా ఆయా శాఖలకు చెందిన అధికారులతో భేటీ అయ్యి, సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అక్రమ మద్యం, మాదక ద్రవ్యాల తరలింపును అడ్డుకోవడానికి సాంప్రదాయ పద్ధతులు కాకుండా ఆధునికంగా ఆలోచించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు సూచించారు. దీనికోసం సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. ఓటర్ల జాబితా తుది సవరణల తరువాత పెండింగ్ దరఖాస్తుల స్థితి, ఓటరు కార్డుల పంపిణీ, ఓటర్ల సమాచార స్లిప్‌ల పంపిణీ ఏర్పాట్లు వంటి పలు అంశాలను కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. ఇంటివద్ద నుంచే ఓటు వేయాలనుకునే సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ఫారాలను ముందుగానే అందచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గురువారం కూడా కేంద్ర బృందం హైదరాబాద్‌లోనే మకాం వేసి, సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డిజిపిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాలు నిర్వహించనుంది. దీనిలో రాష్ట్ర ఎన్నికల అధికారులు కూడా పాల్గొంటారు.

In The Court Of The IVth Addl. District Judge :: Kakinada
O.S.No. 224/2016
Between:
Sirigineedi Suryanarayanamma ...**Plaintiff**
AND
Nimmakayala Govinda Laxmi & Others ...**Defendants**
D-6: Nimmakayala Gani Laxmi Parvathi, W/o. (Late) Venkateswara Rao, Aged 46 Yrs, House Wife, D.No. 7-1-34, Iswarya Apartments, Plot No.310, Leela Nagar, Hyderabad, Telangana State.
పై నెంబరు కేసులో శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ అందుకొనక తిప్పించుకు తిరుగుచున్నారు. మీహాజరు నిమిత్తం **ది.16-11-2023న ఉదయం గం॥10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా కాని, పరోక్షముగా గాని హాజరు కావలెను.** అట్లు మీరు హాజరు కానిచో మీపరోక్షమున తీర్మానించబడును.
K.RAMACHANDRA RAO
K.JANAKI
A.INDIRA
Advocates, Kakinada.

మహారాజశ్రీ 7వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, రాజమండ్రి
O.S. No. 774/2021
Between:
చల్లా చంద్రశేఖర్ -వాది
మరియు
మద్దిబోయిన శేషసాయి వగైరాలు -ప్రతివాదులు
To:
4వ ప్రతివాది: చల్లా భవాని శంకర్, S/o. చల్లా చంద్రశేఖర్, 4-118/1, వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర, గౌతం నగర్ కాలనీ, చందానగర్, హైదరాబాదు - 500050.
పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు పంపిన సమన్లు/ నోటీసులను మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి ఈ ప్రకటన ద్వారా దావా సమన్లు/ నోటీసు అమలు పరచడమైనది. కావున **ది. 28-11-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు గాని, లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని పైన తెలిపిన కోర్టులో హాజరు కాని ఎడల సదరు దావా అంశములు మీ పరోక్షముగా తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎం.వి.రాఘవరెడ్డి
ఎస్.రమేష్, అడ్వకేట్స్
గాంధీపురం-1
రాజమండ్రి రాజమండ్రి-533103
ది.02-11-2023 సెల్: 9949130789

BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL CUM CHIEF JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD
OP. No. 987 OF 2023
Between:
S. Ishaan & another ... **Petitioners**
AND
Ahmed Hussain & others ... **Respondents**
To,
Mohd. Mahbood Ali, S/o. Mohd. Abbas Ali, aged about: 65 years, Occ.: Driver, R/o. 2-3-85, Nallagutta, Secunderabad. (Driver of Mini Lorry bearing No. AP28-TD-6163).
...**Respondent No.3**
Whereas the Petitioner herein has instituted MVOP for seeking compensation on the account of accident against you. You are hereby summoned to appear in the court of Hon'ble Chief Judge, City Civil Court at Hyderabad, in person or through Advocate duly instructed, on 06-12-2023 at 10:30 a.m., failing which the matter will be heard and decided ex-parte.
// By order of the Hon'ble Court//
G. GOWRI SHANKER
Advocate
16-2-147/38, Anand Nagar, Behind Chermas, Signature Bar, Malakpet, Hyderabad.
Cell No.9246533756

ఎన్నికల్లో ప్రలోభాలకు చెక్ !

- సి-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ఇసి
- యాప్‌తో ఫొటో, ఆడియో, వీడియో ఆధారంగా ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో జరగనున్న తెలంగాణ శాసనసభ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు, ఆయా రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు మద్యం, డబ్బు పంపిణీపై నిఘా పెట్టేందుకు ఎలక్షన్ కమిషన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం సి-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రంలో 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ ఈ యాప్‌ను ఉపయోగించింది. అప్పట్లో ఈ యాప్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లోనూ సి-విజిల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఫోటోలు, ఆడియో, వీడియోల ఆధారంగా నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న వారెవరైనా ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఒటిపి వస్తుంది. మీ పేరు, జిల్లా, పిన్‌కోడ్ వంటి వివరాలు ఎంటర్ చేయమంటుంది. అనంతరం ఫొటో, ఆడియో, వీడియో మూడు రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. లైవ్ లొకేషన్ ఆన్ చేసి అక్కడి పరిస్థితుల ఆధారంగా ఆప్షన్ ఎంపిక చేసుకుని ప్రొసీడ్ కొడితే నేరుగా సంబంధిత అధికారులకు విషయం చేరిపోతుంది. సి-విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతారు.

వంద నిమిషాల్లోనే...

ఎక్కడైతే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా మద్యం, డబ్బు, ఇతర సామాగ్రి పంపిణీ చేస్తూ.. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తారో దానికి సంబంధించిన ఫొటో, ఆడియో, వీడియో గానీ తీసి.. దాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇందులో అప్‌లోడ్ చేసిన ఫిర్యాదులను ఎలక్షన్ కమిషన్ వెంటనే పరిశీలిస్తుంది. వంద నిమిషాల్లోనే చర్యలకు ఉపక్రమిస్తుంది. సీ-విజిల్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన వారి పేర్లు, ఫోన్ నెంబర్లను ఈసీ రహస్యంగా ఉంచుతుంది. అంతేగాక బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారనే అంశాన్ని కూడా ఫిర్యాదుదారులకు చేరవేస్తారు. కాబట్టి ఎన్నికలు సజావుగా పారదర్శకంగా జరగాలంటే ప్రజలు తమ కండ్ల ముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలి. సి-విజిల్ యాప్ సురక్షితమైనదని, దీనిని ఆపరేటింగ్ చేయడం సైతం చాలా సులువైనదని అధికారులు చెబుతున్నారు. ఇంగ్లీష్‌లో కానీ తెలుగులో కానీ సమస్యను పంపించవచ్చు. గ్రేటర్‌లోని ప్రజలు సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఈ యాప్ ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సి-విజిల్ యాప్‌ను ఎక్కువ మంది డౌన్‌లోడ్ చేసుకునేలా, ప్రలోభాలపై ఫిర్యాదు చేసేలా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని అధికారులు వివరిస్తున్నారు.



వికలాంగుల కోసం.. సాక్ష్యం యాప్

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వికలాంగుల కోసం సాక్ష్యం అనే ఒక యాప్ తయారు చేశారు. ఈ యాప్ ద్వారా వివిధ రకాలైన సేవలు పొందుటకు అవకాశం కల్పించారు. ఈ యాప్ ద్వారా వికలాంగులకు కొత్త ఓటర్ నమోదు, ఓటర్ బదిలీ, తప్పుల సవరణ, తీసివేత, ఆధార్‌తో అనుసంధానం చేసుకోవచ్చు. అలాగే వీల్ చైర్ కోసం అభ్యర్థన పెట్టుకోవచ్చు. వికలాంగులను ఓటర్ కేంద్రం వరకు తీసుకెళ్లి.. తిరిగి పంపుటకు అభ్యర్థనతో పాటు సహాయకులకు అభ్యర్థన చేసుకునే వీలుంది. ఎలక్ట్రోల్ రోల్ నందు పేరుని గుర్తించడం, పోలింగ్ కేంద్రం ఎక్కడ అనేది తెలుసుకోవడం మొదలైన సేవలు ఈ యాప్ ద్వారా అందిస్తారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటితో పాటు మరో నాలుగు యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది.

అన్నారం సరస్వతి బ్యారేజీకి లీకేజీలు

- రెండు గేట్ల నుండి నీరు లీకు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతా లోపాలు ఒక్కొక్కటిగా వెలుగులోకొస్తున్నాయి. ఇటీవల మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, బ్యారేజీ గోడలు బీటలు పట్టిన ఘటన మరువక ముందే మరో ఘటన చోటుచేసుకోవడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. అన్నారం సరస్వతీ బ్యారేజీలోని 28 నుంచి 40 పిల్లర్ల మధ్య బుంగ పడినట్టు తెలిసింది. వరద నీరు విడుదలయ్యే ప్రదేశంలో రెండు గేట్ల నుంచి నీరు ఉబికి వస్తున్నట్టు గమనించిన ఇంజనీరింగ్ అధికారులు వెంటనే అప్రమత్తమై ఇసుక సంచులు వేసి ఊటను ఆపే ప్రయత్నం చేశారు. 10.87 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ బ్యారేజీని నిర్మించగా.. ప్రస్తుతం 5.71 టిఎంసిల నీరు ఉంది. ఒక గేటు ఎత్తి 2,357 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్టు సమాచారం. దీనిపై అధికారులు మాట్లాడుతూ మెయింటెనెన్స్‌లో భాగంగా ఇలా చేస్తామని, దాంతో నష్టం ఏమీ లేదని తెలిపారు. ఈ లీకేజీ తాము పరిశీలించేందుకే తప్ప అన్నారం సరస్వతి బ్యారేజి ఏమీ జరగలేదని, భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు.

ప్రతి ఒక్కరూ తమ మూలాలను కాపాడుకోవాలి

- లండన్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఒక్కరూ విభిన్న బహుళ సంస్కృతిని ఆలింగనం చేసుకుంటూనే తమ మూలాలను కాపాడుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. లండన్‌లో ఆమె మొదట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే మొదటి సారిగా వివిధ తెలంగాణ ఎన్నారైలు, తెలంగాణ సంఘాలు ఐక్యంగా ఏర్పాటు చేసిన విగ్రహమని తెలిపారు. అక్కడ కమ్యూనిటీ సంస్థల సంస్కృతి, భాషా, సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. తెలంగాణ తల్లి విగ్రహం ఇంగ్లాండ్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ సమాజానికి ఐక్యత, శక్తికి చిహ్నంగా నిలుస్తోందని చెప్పారు. విగ్రహాన్ని ఆవిష్కరించినందుకు కవితకు తెలంగాణ ప్రజా సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు కిశోర్ మున్నాగాల , దన్నంనేని సంపత్ కృష్ణ , సుమన్ బలమూరి తదితరులు పాల్గొన్నారు.

పాలేరు నుంచి షర్మిల పోటీ

- 6న నామినేషన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిలారెడ్డి పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో దిగుతున్నారు. ఈనెల ఆరున తన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించిన షర్మిల...రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 50 సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్‌టిపి తరుపున ఇంకా కొంత మంది అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఆ పార్టీ తరుపున పోటీ చేసేందుకు ఇప్పటికే 550 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించే పనిలో పార్టీ నేతలు ఉన్నారు. అయితే పార్టీ ఆశించిన మేరకు బలమైన అభ్యర్థులు రావడం లేదని తెలిసింది.

కల్వకుంట్ల 'స్కామేశ్వరం'

- రేవంత్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కల్వకుంట్ల 'స్కామేశ్వరం'లో మరో మైలురాయి. నిన్న మేడిగడ్డ, నేడు అన్నారం. అక్కడ కూలుతున్నవి బ్యారేజీలు కాదు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల జీవితాలు. ప్రాజెక్టు అంటే నీ ఫామ్ హౌస్‌కు ప్రహరీ గోడనుకున్నావో. నీ మనవళ్ళు ఆడుకునే ఇసుక గూళ్లు అనుకున్నావో. రూ.లక్ష కోట్ల ప్రజల సొమ్మును మింగేసి, నాలుగు కోట్ల జనం నోట్లో మట్టి గొట్టావు. వందేండ్లకు పైగా ఉండాల్సిన నిర్మాణాలు, ఇలా కండ్లముందే కొట్టుకుపోవడానికి కారణం. మందేసి నువ్వు గీసిన ఆ పనికిమాలిన డిజైన్లు రూ. లక్ష కోట్ల అవినీతి' అని పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు.

ఇజ్రాయిల్ ఏకపక్ష దాడిని ఆపాలి

- భారత ప్రభుత్వం పాలస్తీనాకు అండగా నిలవాలి
- ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని ఆపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలనీ, భారత ప్రభుత్వం పాలస్తీనాకు అండగా నిలవాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, టిఎన్‌టియుసి అధ్యక్షులు ఎంకె బోస్ మాట్లాడుతూ.. అక్టోబర్ 7న నుంచి పాలస్తీనా భూభాగం మీద, ప్రజల మీద ఇజ్రాయిల్ తీవ్రమైన దాడులు చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 75 ఏండ్లుగా పాలస్తీనా భూభాగాన్ని అక్రమించుకుంటూ ఈ యుద్ధం ద్వారా ప్రపంచ పటం నుంచి పాలస్తీనా ఉనికి లేకుండా చేయాలని భావిస్తోందన్నారు. సామ్రాజ్యవాద అధిపత్య కుట్రలతోనే యుద్ధం కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అమెరికా సామ్రాజ్యవాదం, మరోవైపు యూరోపియన్ యూనియన్ అధిపత్యాల తోటి ఇజ్రాయిల్ దురాక్రమణకు పూనుకున్నదని చెప్పారు. పాలస్తీనా ప్రజలు కొన్ని దశాబ్ధాలుగా గూడు కోసం, తమ నీడ కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్నారని తెలిపారు. అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై జరిగిన హమాస్ దాడిని సాకుగా చూపించి గాజా ప్రాంతం నుంచి 10 లక్షల మంది పాలస్తీనా ప్రజలను అక్కడి నుంచి వెళ్ళిపోవాలని అదేశాలు ఇచ్చిందన్నారు. ఇజ్రాయిల్ అంతర్జాతీయ యుద్ధ న్యాయ సూత్రాలను పాటించడంలేదన్నారు. ఐక్యరాజ్యసమితిలో పాలస్తీనాకు అనుకూలంగా అనేక తీర్మానాలు వచ్చాయన్నారు. అమెరికా ఒక్కటే ఇజ్రాయిల్‌కు అండగా నిలబడిందన్నారు. మోడీ ప్రభుత్వం గత సాంప్రదాయాలకు భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇది మన దేశానికి ప్రమాదకరమన్నారు.కార్యక్రమంలో పాలడుగు భాస్కర్, జె.వెంకటేశ్, వంగూరి రాములు, బి మధు, కూరపాటి రమేష్, శ్రీకాంత్, ఈశ్వర్ రావు, వెంకటేష్, కుమార్, మహేందర్ (సిఐటియు) మూడ్ శోభన్ (తెలంగాణ రైతు సంఘం), అరుణజ్యోతి, అశాలత, విమల(ఐద్వా), యం.ధర్మానాయక్ (గిరిజన సంఘం), కోట రమేష్, జావేద్ (డీవైఎఫ్ఐ), టి. నాగరాజు, అశోక్ రెడ్డి, లెనిన్ (ఎస్ఎఫ్ఐ) తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపై హత్యాయత్నం నిందితుని అరెస్ట్

- సంచలనం కోసమే దాడి
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంచలనమైన సంఘటన చేయడం ద్వారా తనపై అందరి దృష్టి పడాలనే హత్యాయత్నానికి పాల్పడినట్టు మెదక్ అభ్యర్థి, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేశానని నిందితుడు రాజు చెప్పినట్టు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో ఆమె బుధవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలోని సూరంపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన ఘటం రాజు(40) కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడని తెలిపారు. దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో ఇన్వెస్టిగేషన్ చేస్తున్నామని, ప్రత్యక్ష, పరోక్ష సాక్షులను విచారించి.. సాంకేతిక నైపుణ్యంతో ఆధారాలు సేకరించామన్నారు. నిందితుడు ఘటం రాజు విలేకరి అని చెప్పుకుంటూ ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తూ జల్సాలు చేసే వాడన్నారు. అతనిపై ఎక్కడా కేసు నమోదు కాలేదన్నారు. ఈ క్రమంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని చంపాలనే ఉద్దేశంతోనే దుబ్బాక మార్కెట్‌లో కత్తి కొనుగోలు చేసి హత్యకు యత్నించినట్టు తెలిపారు. హత్యకు యత్నించిన ప్రదేశంలో నిందితుడిని అక్కడున్న ప్రజలు కొట్టి గాయపరిచారని తెలిపారు. రాజును అదుపులోకి తీసుకొని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించామన్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసిన అనంతరం నిందితుడు రాజును తొగుట సీఐ కమలాకర్ బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా.. సంచలనమైన సంఘటన చేయడం ద్వారా తనపై అందరి దృష్టి పడాలనే హత్యాయత్న చేశానని నేరాన్ని ఒప్పుకున్నట్టు సిపి తెలిపారు. నిందితుడు నేరం చేయడానికి గల ఇతర కారణాలు ఉన్నాయా.. నిందితుడికి ఈ నేరం చేసేందుకు ఎవరైనా సహకరించారా.. ఎవరైనా ప్రోత్సహించారా.. అన్న కోణాల్లోనూ విచారణ కొనసాగుతుందని సిపి శ్వేత తెలిపారు.

మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాం

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీలకు గతంలో కాంగ్రెస్ పార్టీ నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ గుర్తు చేశారు. ఆ సమయంలో లక్షల మంది మైనార్టీ విద్యార్థులు చదువుకున్నారని చెప్పారు. తెలంగాణలో 936 మంది, ఎపిలో 400 మంది విద్యార్థులకు ఎంబిబిఎస్ చదువుతున్నారని చెప్పారు. దేశంలో 400 మంది మైనార్టీ డాక్టర్స్ వస్తే ఉమ్మడి ఎపి నుంచి 1500 మంది డాక్టర్స్ చదివారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎఐసిసి అధికార ప్రతినిధి షమా అహ్మద్, పార్టీ నేతలు జఫ్ఫార్ జవీద్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజాముద్దీన్ తదితరులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముస్లిములకు 12 శాతం రిజర్వేషన్లు హామీ ఏమైందని బిఆర్ఎస్ సర్కారును ప్రశ్నించారు. 'ఇస్లామిక కల్చరల్ సెంటర్స్, మైనార్టీలకు ఇండ్లు' ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు 55 ఇంజనీరింగ్ కళాశాలు ఏర్పాటు చేస్తే, ఇప్పుడు ఆరు మాత్రమే ఉన్నాయన్నారు. త్వరలో మైనార్టీ, బిసి డిక్లరేషన్స్ రాహుల్, ప్రియాంక గాంధీ విడుదల చేస్తారని తెలిపారు. రూ. 5000 కోట్లతో మైనార్టీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. తాను ఎక్కడ పోటీ చేయాలనేది అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

మాతృదేవోభవ ఆశ్రమానికి ఎస్‌బిఐ సాయం

- వాహనాన్ని అందించిన డిజిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మరో ఎన్‌జిఒకు చేయూతనిచ్చింది. రంగారెడ్డి జిల్లా అల్మాస్‌గూడలోని మాతృదేవోభవ ఆనంద ఆశ్రమానికి బుధవారం టాటా వింగర్ వాహనాన్ని ఎస్‌బిఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రానా అశుతోష్ కుమార్ సింగ్ అందజేశారు. 2018లో యాదయ్య ప్రారంభించిన ఈ లాభాపేక్షలేని సొసైటీలో వికలాంగులు, ఆసర లేని బలహీన వర్గాల వారికి ఆశ్రయం కల్పిస్తుంది. ప్రస్తుతం ఇందులో 120 మందికి షెల్టర్ కల్పిస్తున్నారు. 8-10 మంది ప్రయాణించగల ఈ వాహనాన్ని వైద్య, ఇతర సదుపాయాల సేవలకు ఉపయోగించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో ఎస్‌బిఐ ముందు వరుసలో ఉందని డిఎండి రానా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్ కుమార్, జిఎంలు మంజూ శర్మ, దేబాశిష్ మిశ్రా, విద్యా రాజా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రూపాయి ఆల్‌టైం కనిష్టానికి పతనం

- డాలర్‌తో పోల్చితే 83.33కు క్షీణత

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో భారత రూపాయి విలువ ఇది వరకు ఎప్పుడూ లేని స్థాయిలో పడిపోయింది. బుధవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 9 పైసలు పతనమై ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా 83.33 కనిష్ట స్థాయికి దిగజారింది. డాలర్‌కు డిమాండ్ పెరగడంతో పాటుగా, పెరిగిన ముడి చమురు ధరల వల్ల రూపాయి విలువ మరింత ఒత్తిడికి గురైయ్యింది. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకం వద్ద డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ 83.26 వద్ద ప్రారంభం కాగా.. ఇంట్రాడేలో 83.35 కనిష్ట స్థాయిని తాకింది. ఓ దశలో 83.26 గరిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. తుదకు 9 పైసలు కోల్పోయి 83.33 వద్ద ముగిసింది. మంగళవారం ఎషన్‌లో 83.24 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ భయాలు డాలర్‌కు డిమాండ్‌ను పెంచాయని నిపుణులు పేర్కొంటున్నారు. బ్యారెల్ ముడి చమురుపై ధర 1.34 శాతం పెరిగి 86.16 డాలర్లుగా నమోదయ్యింది. మరోవైపు దేశీయ ఈక్విటీ స్టాక్ మార్కెట్లు ఒత్తిడిని ఎదుర్కోవడం రూపాయిపై ప్రభావం చూపింది. బిఎస్ఇ సెన్సెక్స్ 283.60 పాయింట్లు లేదా 0.44 శాతం పతనమై 63,591కి తగ్గింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 90 పాయింట్లు కోల్పోయి 18,989 వద్ద ముగిసింది. రూపాయి విలువ పడిపోవడం ద్వారా దిగుమతి ఉత్పత్తులు భారం కానున్నాయి. విదేశీ చెల్లింపుల కోసం అధికంగా వ్యయం చేయాల్సి ఉంటుంది. దీంతో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది.

ఎనిమిది నెలల కనిష్టానికి తయారీ

ఎస్అండ్‌పి గ్లోబల్ పిఎంఐ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో తయారీ రంగం ఎనిమిది కనిష్టానికి పడిపోయింది. గడిచిన నెలలో మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ) 55.5కు తగ్గిందని ఎస్అండ్‌పి గ్లోబల్ తెలిపింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 57.5గా నమోదయ్యింది. ఈ సూచీ 50పైనా ఉంటే వృద్ధిగా.. దిగువన ఉంటే క్షీణతగా పరిగణిస్తారు. ద్రవ్యోల్బణం కొంత తగ్గినప్పటికీ దీర్ఘకాల దృష్టితో విశ్లేషిస్తే.. గరిష్టంగానే ఉందని ఎస్అండ్‌పి పేర్కొంది. ఇది అమ్మకాల అవకాశాలను దెబ్బతీస్తుందని హెచ్చరించింది. ఈ ఏడాది మార్చి తర్వాత ఇంత తక్కువ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి అని ఎస్అండ్‌పి పేర్కొంది. వినియోగదారుల వస్తువుల అమ్మకాల్లో మందగమనం ఉందని తెలిపింది. ఏప్రిల్ నుండి ఉద్యోగాల కల్పన రేటు స్వల్పంగా నెమ్మదించిందని విశ్లేషించింది.

మాన్యావర్ బ్రాండ్ అంబాసీడర్‌గా రామ్ చరణ్

న్యూఢిల్లీ : ప్రముఖ ప్రీమియం వస్త్ర ఉత్పత్తుల బ్రాండ్ మాన్యావర్ తన నూతన బ్రాండ్ అంబాసీడర్‌గా నటుడు రామ్ చరణ్‌ను నియమించుకుంది. ఇది పెళ్లిళ్ళ, పండుగల సీజన్‌లో తమ ఉత్పత్తులను మరింత మందికి చేరవేసేందుకు దోహదం చేయనుందని ఆ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.

ఒక్క నెలలో 1100 కోట్ల యుపిఐ లావాదేవీలు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ చెల్లింపులు రికార్డ్ స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) లావాదేవీలు 1,141 కోట్లకు చేరాయి. 1000 కోట్ల మార్క్‌ను నమోదు చేయడం చేయడం ఇది మూడో సారి. గడిచిన నెలలో లావాదేవీల విలువ రూ.17.16 లక్షల కోట్లుగా నమోదయ్యిందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) వెల్లడించింది. ఇంతక్రితం సెప్టెంబరులో 1,056 కోట్లు, ఆగస్టులో 1,024 కోట్లు, జులైలో 996 కోట్ల చొప్పున యుపిఐ లావాదేవీలు చోటు చేసుకున్నాయి.

1.62 కోట్ల మందిలో నైపుణ్యాలు పెరగాలి

- సర్వీస్ నౌ అధ్యయనం

న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఎఐ) దూసుకొస్తున్న నేపథ్యంలో దేశంలో 1.62 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగుల్లో అదనపు నైపుణ్యాల పెంపు అవసరమని సర్వీస్ నౌ ఓ అధ్యయనంలో వెల్లడించింది. టెక్ కంపెనీ సర్వీస్‌నౌ, పియర్సన్ సంయుక్తంగా ఈ అధ్యయనం చేపట్టాయి. ఇందులో మెషీన్ లెర్నింగ్‌ని ఉపయోగించి, సాంకేతికత ప్రతి ఉద్యోగాన్ని రూపొందించే పనులను ఎలా మారుస్తుందో అంచనా వేసినట్లు పేర్కొంది. ఎఐ మరో 47 లక్షల కొత్త టెక్ ఉద్యోగాలను సృష్టించనుందని పేర్కొంది. వచ్చే ఐదేళ్లలో తెలంగాణలో 1,73,300 సాంకేతిక, సాంకేతికేతర ఉద్యోగాలు ఆటోమేషన్ ద్వారా అప్‌గ్రేడ్ చెందనున్నాయని అంచనా వేసింది.

సిగ్నిఫై బి2సి ఫిలిప్స్ వెబ్‌సైట్ ఏర్పాటు

న్యూఢిల్లీ : దిగ్గజ లైటింగ్ కంపెనీ సిగ్నిఫై కొత్తగా తమ ఫిలిప్స్ డైరెక్ట్ టు కన్స్యూమర్ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది, ఇది వినియోగదారుల లైటింగ్‌ను విప్లవాత్మకంగా మారుస్తుందని ఆ సంస్థ పేర్కొంది. నూతన ఇన్.షాప్.లైటింగ్.ఫిలిప్స్.కమ్ వేదికలో వివిధ విభాగాలలో 1000 కంటే ఎక్కువ వినియోగదారుల ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

స్విస్ మిలిటరీ నుంచి గృహోపకరణాలు



హైదరాబాద్ : అంతర్జాతీయ బ్రాండ్ స్విస్ మిలిటరీ ప్రస్తుత పండుగ సీజన్ కోసం నూతన గృహోపకరణాల శ్రేణిని భారత మార్కెట్లోకి విడుదల చేసినట్లు తెలిపింది. వచ్చే దీపావళి పండుగ నేపథ్యంలో వపోర్టైట్ స్టీమ్ ఐరన్ బాక్స్, నెబ్యులా మిక్సర్ గ్రైండర్, క్లబ్ క్లాస్ శాండ్‌విచ్ మేకర్, ఆల్ఫినో మిక్సర్ గ్రైండర్ జ్యూసర్ తదితర వాటిని ఆవిష్కరించినట్లు స్విస్ మిలటరీ ఎండి అనుజ్ సాహ్ని పేర్కొన్నారు.

మానవత్వానికి మేలుకొలుపు కృష్ణ శాస్త్రి రచనలు

ప్రజాశక్తి - కల్చరల్



మానవత్వానికు మేలుకొలుపు దేవులపల్లి కృష్ణ శాస్త్రి సాహిత్యం అని వంశీ సంస్థల అధినేత వంశీ రామ రాజు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా గాన సభ నిర్వహణలో విఖ్యాత భావ కవి దేవులపల్లి కృష్ణ శాస్త్రి 127వ జయంతి సభ జరిగింది. అధ్యక్షత వహించిన వంశీ రామ రాజు మాట్లాడుతూ చివరి రోజుల్లో కృష్ణ శాస్త్రి గళం మూగ పోయినా ఆయన కవితా ధార మూగ పోలేదని అన్నారు. కృష్ణ శాస్త్రికి కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్ ఇవ్వటం తెలుగు కవికి తొలిసారి దక్కిన గౌరవం అన్నారు అయనకు వంశీ నిర్వహణలో విఖ్యాతులు రాయప్రోలు సుబ్బారావు, డాక్టర్ సి నారాయణ రెడ్డి అతిథులుగా ఘన సత్కారం చేసిన విషయం గుర్తు చేసుకున్నారు. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో కృష్ణ శాస్త్రి పేరిట వంశీ స్వర్ణ పతకం ఏర్పాటు చేసి ప్రతి ఏటా తెలుగులో ఉత్తమ విద్యార్థికి అందజేస్తున్న సంగతి తెలిపారు. ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ నిడమర్తి నిర్మలాదేవి మాట్లాడుతూ భావ కవిత్వ సార్వభౌముడు కృష్ణ శాస్త్రి అనీ సులువైన పదాలతో గాఢమైన భావాన్ని చెప్పగల నేర్పు కలవారని వివరించారు. 'అడుగు అడుగున గుడి వుంది, అందరిలో గుడి వుంది, ఆ గుడి లో దీపం వుంది ,అదియే దైవం' అన్న పాటలో దైవం ఎక్కడో బైట లేదని ప్రతి వారిలో వున్నారని ఆయన నమ్మిన బ్రహ్మ సమాజం సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని తెలిపారు. మరొక సాహితీవేత్త డాక్టర్ కామేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణ శాస్త్రికి పాట అంటే ప్రాణం అనీ అందుకే ఒక సినీ గీతంలో 'ప్రతి నిముషం పాట లాగ సాగాలి' అన్నారని వివరించారు. కమ్యూనిజం సారాన్ని జీర్ణించుకోన్న శ్రీశ్రీ సైతం కృష్ణ శాస్త్రి ప్రభావం నుంచి బైట పడడానికి పదేళ్లు పట్టిందని అన్న విషయం గుర్తు చేశారు. నాడు కృష్ణ శాస్త్రి ప్రభావం ప్రతి కవిపై వుందని స్పష్టం చేశారు. అమృత ఆనంద్ దేవులపల్లి లలిత గీతాలు హృద్యంగా ఆలపించారు.

ఏకంగా మెడకే చుట్టుకుంటున్నయ్

- ఊర్లల్లో సమాధానం చెప్పలేకపోతున్నం
- దళిత, బిసి, మైనారిటీ బంధుపై బిఆర్ఎస్ లీడర్ల గోస
- ఇప్పటి మ్యానిఫెస్టోలో వాటిని చేర్చితే బావుండేదంటూ ఆవేదన
- హుజూరాబాద్ కోసం ముందే కూసిన 'దళితబంధు' కోయిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఆ చుట్టుకునేదేదో కాలుకో.. చేతికో చుట్టుకుంటే.. ఎట్టో గట్ట ఇడిపించుకుంటోళ్లం. అవిప్పుడు ఏకంగా మెడకే చుట్టుకుంటున్నయ్.. ఊపిరాడక చస్తున్నాం...' ఇదీ క్షేత్రస్థాయిలోని బిఆర్ఎస్ లీడర్ల గోస. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న దళిత, బిసి, మైనారిటీ బంధు పథకాలు ఇప్పుడు అధికార పార్టీని ఇబ్బందులోకి నెట్టేస్తుండటమే వారి గోసకు కారణం. ఈ ఎన్నికల్లో ఓట్లు గుమ్మరిస్తాయనుకున్న ఆయా పథకాలు తమకు ఫలితాలను తెచ్చిపెట్టకపోగా.. రివర్స్‌గా నష్టం చేకూరుస్తున్నాయంటున్నారు. సిఎం కెసిఆర్ గత రెండు వారాల నుంచి రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. అక్కడి సభలు, సమావేశాల్లో ఆయన ప్రసంగిస్తున్నారు.

ఆ క్రమంలో ఆ మీటింగులకు ప్రజలు భారీగానే వస్తున్నట్టు అనిపిస్తున్నప్పటికీ, జన సమీకరణ సమయంలో అనేక తలనొప్పులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. ముఖ్యంగా దళిత బంధు పథకం అమలైన గ్రామాల్లో లబ్దిదారులు పది మందో, పదిహేను మందో ఉంటే... లబ్దిపొందని వారు వందల్లో ఉన్నారు. కొద్ది నెలల క్రితం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన బిసి, మైనారిటీ బంధు పథకాల పరిస్థితీ అదే. వాటికోసం దరఖాస్తు చేసుకున్న వారందరూ ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. ఇప్పుడు జన సమీకరణ కోసం నియోజకవర్గ నేతలు గ్రామాల్లోకి వెళ్లినప్పుడు ఈ బాధితులందరూ వారిని నిలేస్తున్నారు. 'మీ వాళ్లకు, మీకు అనుకూలంగా ఉన్న వాళ్లకు మాత్రమే స్కీములను ఇచ్చారు. మాకేమైనా ఇచ్చారా..? పోనీ ఎప్పటిలోగా ఇస్తారో చెప్పండి...' అంటూ ప్రశ్నిస్తుండటంతో నాయకులకు నోట మాట రావడం లేదు. ఇదే విషయాన్ని పలువురు లీడర్లు బిఆర్ఎస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్టు వినికిడి. 'పోయినసారి నిరుద్యోగ భృతి లాగా ఈసారి దళిత, బిసి, మైనారిటీ బంధు పథకాలను ఎన్నికల ప్రణాళికలో చేరిస్తే బాగుండేది. ప్రజలకు కొత్త పథకాలపై కొంచెం ఆశలుండేవి.. మనకు రాజకీయ ప్రయోజనం కలిగేది కానీ వాటిని ముందే ప్రకటించాం. ఆయా స్కీముల అమల్లో జరిగిన లోపాలు, లొసుగులు, వైఫల్యాలతో ఎలక్షన్లలో మన పరిస్థితి రివర్స్ అవుతోంది...' అని పలు జిల్లాలకు చెందిన నేతలు సిఎం వద్ద వాపోయినట్టు సమాచారం.

వాస్తవానికి దళిత బంధు పథకాన్ని ప్రస్తుత శాసనసభ ఎన్నికల కోసమే కెసిఆర్ రూపొందించారని సమాచారం. దాన్ని ఇప్పటి మ్యానిఫెస్టోలో కూడా పొందుపరచాలని ఆయన భావించారు. కానీ అనుకోకుండా మధ్యలో హుజూరాబాద్ ఉప ఎన్నిక రావటంతో సిఎం వ్యూహం మార్చారు. ఆ ఎన్నిక తమ పార్టీకి ప్రతిష్టాత్మకం కావటం, అందునా హుజూరాబాద్‌లో ఎస్‌సిల ఓట్లు క్రియాశీలకంగా మారటంతో ఇప్పటి కోసం దాచిన 'దళిత బంధు' అస్త్రాన్ని కెసిఆర్ అప్పుడే వదిలారు. తద్వారా ఈటల రాజేందర్‌ను ఓడించొచ్చని భావించి, అందులో విఫలమయ్యారు. ఆ తర్వాత ఆ నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధును విస్తరిస్తున్నామంటూ ప్రకటించారు. అదే పరంపరలో బిసి, మైనారిటీ బంధు పథకాలను ప్రవేశపెట్టారు. అయితే అవి ఇప్పుడు అధికార పార్టీకి లబ్ది చేకూర్చకపోగా ప్రతిబంధకాలుగా మారుతుండటం గమనార్హం.